# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 2 । నవంబర్ । 2024






### కార్తీకం.. శివోహం
పరమ శివుడికి ప్రీతిపాత్రమైన కార్తీక మాసం నేటి నుంచి ప్రారంభంకానుంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 8లో



### ఆర్టీసీ బస్సులు రెడీ
కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపనుంది. రిజర్వేషన్ అవకాశం కూడా ఉంది. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 23°

### వాతావరణం
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఒకటి, రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**పాల్వంచరూరల్:** పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో హాజరుకాగా ఆలయం కిటకిటలాడింది. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం అమ్మవారికి సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

### ఆరోగ్య ఉప కేంద్రాలు విధిగా తెరవాలి
- డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

**మణుగూరు టౌన్:** సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆరోగ్య ఉప కేంద్రాలు విధిగా తెరిచేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మణుగూరు శివలింగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఏఎన్ఎంలు, ఫార్మాసిస్ట్‌లు, ఫీల్డ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. సమన్వయంతో వ్యాధుల నివారణకు కృషి చేయాలని వైద్యుడు శివకుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఓ ఎన్‌సీడీ మధు, వైద్యులు నిశాంత్‌రావు, గొంది వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

**దుమ్ముగూడెం :** మండలంలోని కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన పూసం వరుణ్ తేజ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. సిద్దిపేటలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 6,7,8 తేదీల్లో తమిళనాడులో జరిగే అండర్–17 పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు తెలిపారు.

### ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బదిలీ



అప్పాజీకి వీడ్కోలు పలుకుతున్న ఎస్పీఎఫ్ అధికారులు

**పాల్వంచ:** కేటీపీఎస్ కాంప్లెక్స్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ ఎ.అప్పాజీని రాష్ట్ర సచివాలయానికి బదిలీ చేస్తూ ఎస్పీఎఫ్ డీజీ అనిల్‌కుమార్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మణుగూరు బీటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. గతంలో సెక్రటరీయేట్‌లో విధులు సమర్థంగా నిర్వహించిన అనుభవం ఉన్న అప్పాజీని తిరిగి అక్కడికే తీసుకున్నారు. కాగా గురువారం ఆయనకు ఎస్పీఎఫ్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలకగా, శుక్రవారం సెక్రటరీయేట్‌లో బాధ్యతలు స్వీకరించారు.

# సంపత్తి అనుకుంటే.. విపత్తిగా మారింది!



గతేడాది మిర్చి సాగు చేసి నష్టపోయామని రైతులు ఈసారి పత్తి వైపు మొగ్గు చూపారు. అయితే విత్తనం నాటింది మొదలు పత్తి తీసి అమ్మేవరకూ ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తొలుత భారీ వర్షాలు, వరదలతో పంటలు దెబ్బతిన్నాయి. ఎరువులు, పురుగుల మందు వినియోగం, ధరలూ పెరిగాయి. ఫలితంగా పెట్టుబడి రెండింతలైంది. తీరా చూస్తే వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గింది. ఆ పత్తినైనా విక్రయిద్దామంటే పతనమవుతున్న ధర మరింత కలవర పెడుతోంది. – బూర్గంపాడు

**ధర మందం.. రైతుకు దుఃఖం**
- భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పత్తి చేలు
- పంట సస్యరక్షణకు పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- మార్కెట్‌లో రోజురోజుకూ పడిపోతున్న ధరలు
- జిల్లాలో ఇంకా ప్రారంభంకాని సీసీఐ కొనుగోళ్లు

ఈ ఏడాది కూడా ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ ఒడిదుడుకులు పత్తి రైతులను కుంగదీస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పత్తిని అమ్ముకోవాలంటే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించలేదు. దీంతో పెట్టుబడి అవసరాల కోసం మార్కెట్‌లో తక్కువ ధరలకే పత్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.85 లక్షల ఎకరాల్లో పత్తి సాగైనట్టు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతుండగా, 2 లక్షల ఎకరాల్లో సాగు చేశారని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. గతేడాది 1.75 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందని, ఈ సారి సాగు విస్తీర్ణం పెరిగిందని చెబుతున్నాయి. గతేడాది మిర్చి సాగు చేపట్టి నష్టపోయిన రైతులు ఈసారి పత్తి సాగుకు మొగ్గు చూపారు. అయితే జూలై, ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో భారీ వర్షాలు, వరదలతో పత్తి చేలు బాగా దెబ్బతిన్నాయి. ప్రతికూల వాతావరణంతో చేలు ఏపుగా పెరగలేదు. సస్యరక్షణ, ఎరువులు, పురుగుమందులకు కలిపి ఎకరాకు కనిష్టంగా రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది.



పత్తి బస్తాలు

ఇప్పుడు దిగుబడి కూడా ఆశాజనకంగా లేదు. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు మించి పత్తి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పంట చేతికందుతుండగా, సాగు పెట్టుబడుల కోసం అమ్మాలంటే మార్కెట్‌లో ధర పడిపోతోంది. వ్యాపారులు క్వింటాకు రూ. 5,500 నుంచి రూ 6 వేల వరకే కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి క్వింటాకు రూ.7,521 మద్దతు ధరను ప్రకటించింది. పత్తిలో తేమశాతం ఉంటుందనే కారణంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారు. జిల్లాలో పత్తి అమ్మకాలకు సరైన మార్కెట్ సౌకర్యాలు లేవు. ఖమ్మం, వరంగల్ మార్కెట్‌లకు తరలించాలంటే రవాణా ఖర్చులు చాలా ఎక్కువవుతున్నాయి. అక్కడకు వెళ్లిన కూడా తేమశాతం, నాణ్యత లేదని ధరలలో విపరీతంగా కోతపెడుతున్నారు. ఈ పరిస్థితులు రైతులకు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం స్పందించి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాల్సిన అవసరముంది.

### సీసీఐ కేంద్రాలు తెరవాలి



సీసీఐ కేంద్రాలు తెరిస్తే తప్ప పత్తికి రేటు రాదు. ఊళ్లలో వ్యాపారులు క్వింటా రూ. 6 వేలకు కూడా అడగటం లేదు. క్వింటా పత్తి తీసేందుకే కూలీలకు రూ.2500 ఖర్చు వస్తుంది. ఆరువేలకు పత్తిని అమ్మితే పెట్టుబడులు కూడా రావు.

– దుప్పటి రాజు, రైతు, నాగినేనిప్రోలు

### నష్టం తప్పేలా లేదు..



భారీగా వర్షాలు కురిసి.. కురిసి ఒక్కసారే ఆగిపోయాయి. దీంతో చేలు బెట్టకు వచ్చాయి. ఎన్ని ఎరువులు వేసినా, మందులు కొట్టినా పంట ఏపుగా రాలేదు. దీనికి తోడు ధర కూడా లేకపోవటంతో ఈ ఏడాది నష్టాలు తప్పేలా లేవు.

– యడమకంటి లింగారెడ్డి, రైతు, రెడ్డిపాలెం

### కొనుగోళ్లు ప్రారంభిస్తాం



సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం. రైతులు తేమ శాతం లేకుండా ఆరుదల పత్తిని తీసుకురావాలి. తేమ, నలక లేకుండా చూసుకోవాలి. సీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోళ్లు జరుగుతాయి.

– సంజీవరావు, సీసీఐ బయ్యర్

# నేటి నుంచి 'కార్తీక' పూజలు



కార్తీక మాస పూజల వివరాలు వెల్లడిస్తున్న ఈఓ రమాదేవి



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

- ప్రతీ సోమవారం జ్యోతిర్లింగార్చన, ఆకాశ దీపోత్సవం
- వివరాలు వెల్లడించిన భద్రాచల రామాలయ ఈఓ రమాదేవి

**భద్రాచలం:** భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం నుంచి కార్తీక మాస పూజోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామాలయంతోపాటు అనుబంధ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం(శివాలయం)లో ప్రత్యేక పూజలు జరపనున్నారు. ప్రతి కార్తీక సోమవారం రోజున జ్యోతిర్లింగ, ఆకాశ దీపోత్సవాలు, నీరాజన మంత్ర పుష్ప పూజలు నిర్వహించనున్నారు. 4న స్వామివారికి భస్మాభిషేకం, 11న చందనోత్సవం, 15న రుద్రాభిషేకం, 17న స్వామివారి కల్యాణ మహోత్సవం, 18న పుష్పోత్సవం, 25న మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన జరపనున్నారు. ప్రతి సోమవారం ఉదయం, సాయంత్రం ప్రసాద వినియోగంతోపాటు ప్రవచనాలు ఉంటాయి. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో నిర్దేశిత ప్రత్యేక దినాలలో సత్యనారాయణ స్వామివ్రతాలు, 27న నదీ హారతి నిర్వహించనున్నారు. కాగా దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న వ్యాపారాలకు నేడు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. సమావేశంలో ఏఈఓ భవానీ రామకృష్ణ, వేదపండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**శివాలయంలో నేటి పూజలు**

దేవస్థాన అనుబంధ శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేయనున్నారు. సాయంత్రం 6గంటలకు వేదపండితులు సన్యాసి శర్మచే కార్తీక పురాణ ప్రవచనం, 6.30 గంటలకు లలిత సహస్రనామార్చన, 7 గంటలకు భద్రాచలం వాస్తవ్యులు లలిత, వాణిలచే భక్తి సంగీతం, 7.30 గంటల నుంచి నృత్య ప్రదర్శనలు ఉంటాయని ఆలయ అధికారులు తెలిపారు.

**స్వర్ణకవచధారణలో రామయ్య**

దేవస్థాన అంతరాలయంలో శుక్రవారం స్వామివారి మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

# పామాయిల్ రైతుకు దీపావళి బొనాంజా

- టన్నుకు రూ.2,101 పెరుగుదల



**అశ్వారావుపేటరూరల్:** దీపావళి పండుగ వేళ పామాయిల్ టన్ను ధర మరోసారి భారీగా పెరిగింది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. తాజాగా ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు టన్ను ముడి పామాయిల్ ధర రూ. 19,144 ఖరారు చేస్తూ శుక్రవారం అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు. తాజా ధరతో, గడిచిన నెల టన్ను ధరను పోల్చితే టన్నుకు ఏకంగా రూ.2,101 రూపాయలు పెరిగింది. దీంతో గడిచిన రెండు నెలల వ్యవధిలోనే టన్నుకు రూ.4,752 వరకు పెరగడం విశేషం. కాగా, గడిచిన కొద్ది నెలలుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్ టన్ను ధరను రూ.20వేల దాకా పెరిగేలా కృషి చేస్తానని చెబుతుండగా, ఆ మేరకు ధర చేరువ కావడంతో సాగుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 2021 ఏప్రిల్‌లో టన్ను ధర భారీగా పెరిగి రూ.17,364 చేరి అత్యధిక ధరగా నమోదైంది. ఈ టన్ను ధర రికార్డును 2022 జూన్‌లో మరోసారి ఏకంగా రూ.23,467గా నమోదై రికార్డు స్థాయికి చేరింది. ఆ నాటి నుంచి టన్ను ధర ఈ స్థాయికి ఇప్పటివరకు చేరలేదు. దాదాపు మూడేళ్ల తర్వాత టన్ను ధర ఇరవై వేల మార్కుకు సమీపంలోకి వెళ్లడంతో సాగుదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# సర్వే ఉద్దేశం ప్రజలకు తెలపాలి

**కలెక్టర్ జితేష్ వి.పాటిల్**

**పాల్వంచరూరల్:** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర కుటుంబ సర్వే ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. మండల పరిధిలోని పునుకుల గ్రామంలో శుక్రవారం అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందితో మాట్లాడారు. కేటాయించిన బ్లాక్ ప్రకారం ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని గుర్తించాలని చెప్పారు. శనివారం నుంచి 3వ తేదీ వరకు ఇళ్ల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని, ప్రతీ కుటుంబానికి హౌస్ లిస్టింగ్ స్టిక్కర్లను అతికించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతికి తగిన ప్రణాళికలు రూపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందని అన్నారు. ప్రజలందరూ ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, మండల పంచాయతీ అధికారి బి.నారాయణ, కార్యదర్శి బి.బాబూరావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



పునుకుల గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

# పండగ పూట గిరిపుత్రుల పస్తులు

**కిన్నెరసాని గిరిజన గురుకులంలో ప్రిన్సిపాల్, వార్డెన్ నిర్లక్ష్యం**

**పాల్వంచరూరల్:** దీపావళి పండుగ రోజు గురువారం గిరిజన విద్యార్థులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని కిన్నెరసాని డ్యామ్‌సైడ్ గిరిజన గురుకుల కళాశాలలో ఆరు వందల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా ప్రత్యేక అల్పాహారం పెడతారని ఆశించారు. కానీ కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా అసలు ఆ రోజూ అల్పాహారమే తయారుచేయలేదు. దీంతో మధ్యాహ్నం వరకు విద్యార్థులు ఖాళీ కడుపులతో పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత మధ్యాహ్న భోజనం పెట్టారని పేర్కొన్నారు. అల్పాహారం పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు వసతిగృహం ఎదుట ఆందోళన చేశారు. పండుగ రోజు పిల్లలను కలిసేందుకు హాస్టల్‌కు వెళ్లిన తల్లిదండ్రులు ఆవేదన చెందారు. ఈ ఘటనపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేష్‌ను వివరణ కోరగా.. దీపావళి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా లేదని, దీంతో ఉదయం సమయంలో అల్పాహారం తయారు చేయలేకపోయామని తెలిపారు. మధ్యాహ్నం తర్వాత విద్యుత్ సరఫరా కాగా, భోజనాలు వండి పెట్టించామని, అల్పాహారం తయారుచేయలేని కారణంగా విద్యార్థులకు పండ్లు అందజేశామని వివరించారు.



కిన్నెరసాని గురుకుల వసతి గృహం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

# కుక్కల పేరుతో కాజేయాలని..!

- కౌన్సిల్‌లో ఆమోదానికి రూ. 21 లక్షల బిల్లులు
- కౌన్సిలర్ల నిలదీతతో బయటపడ్డ అక్రమాలు
- కొత్తగూడెంలో కుక్కల పట్టివేతలో లెక్కలు తారుమారు
- ఏబీసీ సెంటర్ నిర్వాహకులతో కీలక ప్రజాప్రతినిధి, అధికారుల కుమ్మక్కు!

**కొత్తగూడెంఅర్బన్:** జంతువుల పేరుతో రూ. లక్షలు కాజేయాలనే ప్రయత్నం కౌన్సిలర్లు నిలదీతతో బెడిసికొట్టింది. మున్సిపల్ కార్యాలయంలో గత మంగళవారం జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో వెలుగుచూసిన ఈ విషయం చర్చనీయాంశమైంది. జిల్లాలో ఏ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడెం ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలువాల్సింది పోయి అవినీతి ఆరోపణలతో అపఖ్యాతి మూటగట్టుకుంటోంది.

**కోతులకు రూ.15 లక్షలు, కుక్కలకు రూ.21 లక్షలు**

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో కోతులను పట్టినందుకు రూ.15 లక్షలు, గతేడాది నుంచి ఈ ఏడాది జూలై వరకు 1,275 కుక్కలు పట్టినందుకు రూ.21,03,750 నిధులు ఖర్చు చేసినట్లు, ఇవి 15వ ఫైనాన్స్ నిధుల నుంచి చెల్లించేలా కౌన్సిల్‌లో ఆమోదానికి చర్చ పెట్టారు. ఈ క్రమంలో కొందరు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలోని చాలా వార్డుల్లో కుక్కలనే పట్టలేదని, పట్టినట్లుగా ఎలా బిల్లు పెడతారని అధికారులను నిలదీశారు. కౌన్సిల్ సభ్యుల డిమాండ్ మేరకు రికార్డులు తెప్పించి పరిశీలించగా బండారం బయటపడింది. కేవలం 621 కుక్కలను మాత్రమే పట్టినట్లు గణాంకాలు ఉన్నాయి. అయితే ఈ దోపిడీ అధికారుల ప్రమేయంతోనా, కౌన్సిల్ ప్రథమ పౌరురాలు ఆదేశాలతో జరిగిందా అనే విషయం బయటకు పొక్కకుండా సిబ్బంది జాగ్రత్త పడుతున్నారు. కుక్కలు, కోతుల పేరుతో రూ. లక్షలు కాజేశారని, వివిధ నిర్మాణాలు, రోడ్లు, డ్రెయినేజీల పేరుతో ఇంకా ఎన్ని నిధులు కాజేశారోననే పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కొత్తగూడెం మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కూడా ఏసీబీ అధికారులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.



కొత్తగూడెంలోని ఏబీసీ సెంటర్

**లెక్కలు తారుమారు**

మున్సిపాలిటీల్లో మొదటగా కుక్కల గణన చేయాల్సి ఉంది. అనంతరం వాటిని పట్టుకుని ఆపరేషన్, వ్యాక్సినేషన్ చేయాల్సి ఉంటుంది. కానీ ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేశాక కొత్తగూడెం మున్సిపాలిటీలో అన్నీ వార్డుల్లో కుక్కల పట్టివేత కార్యక్రమం జరగలేదు. మున్సిపల్ సిబ్బంది కొన్ని ప్రాంతాల్లోని కుక్కలను పట్టుకుని తతంగం ముగిస్తున్నారు. ఆపరేషన్ చేశాక అక్కడే వదిలివేయడంతో స్థానిక రైటర్ బస్తీ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఏబీసీ కేంద్రం ఏర్పాటు చేసి మూడేళ్లయినా మున్సిపల్ అధికారులు ఒక్కసారి కూడా సమావేశం, సమీక్ష జరపలేదు. జంతు ప్రేమికులతో సమావేశం నిర్వహించలేదు. ఒక కుక్కను పట్టుకుని ఆపరేషన్, వ్యాక్సినేషన్ చేస్తే ప్రభుత్వం రూ.1650 చెల్లిస్తోంది. మున్సిపల్ అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై మున్సిపాలిటీ సొమ్ము కాజేస్తున్నారనే ఆరోపణలు నిజమయ్యాయి. కాగా ఈ వ్యవహారంపై కొత్తగూడెం మున్సిపాలిటీలో విచారణ జరుగుతోంది.

**వివాదాస్పదంగా ఏబీసీ**

కుక్కల సంఖ్యను అదుపు చేసేందుకు కొత్తగూడెంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను 2021 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీల్లోని కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తీసుకొచ్చి, వాటికి బర్త్ కంట్రోల్ ఆపరేషన్, వ్యాక్సినేషన్ చేసి, మళ్లీ పట్టుకున్న ప్రాంతంలో వదిలివేయాల్సి ఉంటుంది. కానీ ఎప్పుడో ఒకసారి ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఇదే విషయమై ఇటీవల దిశ సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కూడా ప్రస్తావించారు. కానీ అధికారుల్లో చలనం లేదు. కొందరు ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ప్రజాధనం కాజేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏబీసీ సెంటర్ కాంట్రాక్ట్ హైదరాబాద్‌కు చెందిన వారికి అప్పగించారు. ఆ కాంట్రాక్టర్ ఏసీబీ సెంటర్‌కు ఒక బౌన్సర్ లాంటి వ్యక్తిని నియమించి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పట్టిన కుక్కల సంఖ్య బయట పడుతుందనే భయంతో సెంటర్‌లోకి ప్రజలను, జంతు ప్రేమికులకు రానివ్వడంలేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా లోపలికి వెళ్తే కాంట్రాక్టర్ నియమించిన మనుషులు గొడవకు దిగుతున్నారని పేర్కొంటున్నారు.

# ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలతో ముఖాముఖిలో కలెక్టర్ జితేష్

కోవిడ్ బారిన పడి తల్లిదండ్రులను కోల్పోయిన 18 సంవత్సరాలోపు పిల్లలతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం కిన్నెరసానిలోని గెస్ట్‌హౌస్‌లో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల వ్యక్తిగత విషయాలతోపాటు చదువులు, వసతి విషయాలను గురించి స్నేహపూర్వకంగా అడిగి తెలుసుకున్నారు. బాలబాలికలకు ప్రభుత్వం ద్వారా పూర్తి సహాయసహకారాలను అందిస్తామని భరోసా ఇచ్చారు. బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం పిల్లలతో కలిసి కలెక్టర్ భోజనాలు చేశారు. జలాశయంలో బోటు షికారు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా, బాలల సంరక్షణ అధికారి హరికుమారి, వినోద్‌కుమార్, శేషయ్య, కల్యాణి, బాబు, భరత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

**పర్యాటక అభివృద్ధి పనులపై సమీక్ష**

పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో త్వరలో చేపట్టనున్న పర్యాటక అభివృద్ధి పనుల నిర్వహణపై వైల్డ్‌లైఫ్ అధికారులతో శుక్రవారం గెస్ట్‌హౌస్‌లో సమీక్షించారు. ఈ సమావేశంలో రేంజర్ కవిత మాధురి, ఎఫ్ఎస్ఓ బి.కిషన్, ఎఫ్‌బీఓ బి.రాములు పాల్గొన్నారు.

# వెలుగులు నింపిన దీపావళి

జిల్లావ్యాప్తంగా గురువారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు. కుటుంబ సమేతంగా టపాసులు కాల్చి ఆనందోత్సాహాలతో వేడుకలు జరిపారు.

వివరాలు 9లో..



## క్లుప్తంగా

### బీసీ కమిషన్‌కు ఇవ్వండి..



మాట్లాడుతున్న ఇందిర

కొత్తగూడెంరూరల్: వెనుకబడిన కులాల సమస్యలతో కూడిన అఫిడవిట్లు ఆరు సెట్లను ఈ నెల 5న జిల్లాలో పర్యటించనున్న బీసీ కమిషన్ బాధ్యులకు అందించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి బీసీ కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ కుల సంఘాల నాయకులు తమ సమస్యలను అధికారికి వివరింగా ఆమె పైవిధంగా వ్యాఖ్యానించారు. సమావేశంలో పలు కుల సంఘాల బాధ్యులు కె.సమ్మయ్య, కొదమూరి సత్యనారయణ, చిప్పా శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌యాదవ్, కె.రమేశ్, కాపర్తి వెంకటాచారి, ముదిగొండ రాంబాబు, గుమలాపురం సత్యానారయణ, కె.శంకరయ్య, బండి రాజుగౌడ్, మురికి వెంకన్న, పీఏ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

### కిన్నెరసానిలో సందడి



బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: దీపావళి పండగ సందర్భంగా కిన్నెరసానిలో పర్యాటకుల తాకిడి పెరిగింది. గురు, శుక్రవారం రెండు రోజులు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 873 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.29,560, 370 మంది బోటుషికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.18,690 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

### బ్లాక్‌ల వారీగా గృహాలను గుర్తించాలి



వివరాలు తెలుసుకుంటున్న చంద్రశేఖర్

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి చేపట్టే సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బ్లాక్‌లవారీగా గృహాలను గుర్తించి, నంబర్ల స్టిక్కర్లను అంటించాలని జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం అశ్వారావుపేటలో నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ బ్లాక్‌లలో నిర్వహిస్తున్న గృహాల గుర్తింపు సర్వేను ఆకస్మికంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వేను ఏ విధమైన లోపాలు లేకుండా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ సోయం ప్రసాద్, కార్యదర్శి శ్రీరామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

### వృద్ధురాలికి ఆశ్రయం కల్పించిన అధికారులు

మణుగూరుటౌన్: కన్న కూతుర్లు కాదనడంతో రోడ్డుపక్కనే జీవించాలని నిర్ణయించుకున్న ఓ వృద్ధురాలికి మండల రెవెన్యూ అధికారులు ఆశ్రయం కల్పించి బాసటగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి. కుంచాల సుశీల తన ఇద్దరు కూతుర్లకు వివాహం కావడంతో ఆమె ఒక కూతురు వద్ద కొన్ని రోజులు.. మరో కూతురు వద్ద కొన్ని రోజులు ఉంటోంది. ఇద్దరు కూతుర్లు పొమ్మనడంతో సామగ్రితో వచ్చిన వృద్ధురాలు రెండు రోజులుగా డీఎస్పీ కార్యాలయ పరిసరాల్లోని బెంచీలపై నిద్రిస్తూ ఉంది. శనివారం మధ్యాహ్నం డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న చెట్ల కింద మంచం వేసుకుని సామగ్రితో నిద్రిస్తున్న క్రమంలో వివరాలు ఆరా తీసిన రెవెన్యూ ఆర్ఐ లీలావతి ఇద్దరు కూతుర్లకు ఫోన్ చేసి వృద్ధురాలిని తీసుకెళ్లాలని కోరగా వారు నిరాకరించారు. దీంతో వృద్ధురాలికి నచ్చజెప్పి దగ్గరలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో ఆశ్రయం కల్పించారు.

### వృద్ధుడు అదృశ్యం



యాదగిరి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన వృద్ధుడు గుడిమెళ్ల యాదగిరి (68) ఈ నెల 29న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితులను ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. గురువారం యాదగిరి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు.

**గుర్రాయిగూడెంలో..**



బద్యా (ఫైల్)

చండ్రుగొండ: మండలంలోని గుర్రాయిగూడెం గ్రామానికి చెందిన బానోత్ బద్యా (76)రెండు రోజులకిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ స్వప్న కేసు నమోదు చేశారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.19,144 |





కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్య క్షేత్రాలకు వెళ్లనున్న భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని డిపోల నుంచి సర్వీసులను నడిపేందుకు రీజియన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం ఆర్ఎం ఎ.సరిరామ్ సంస్థ డిపో మేనేజర్లు, ఉద్యోగులతో సమావేశమై సూచనలు చేశారు. రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు నుంచి ఏపీలోని పంచరామాలకే కాక అరుణాచలం, అన్నవరం, శబరిమల క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించారు. అయితే, 30 నుంచి 40 మంది భక్తులు ఉంటే ఆర్టీసీ నిర్ణయించిన తేదీల్లో కాకుండా భక్తులు కోరిన రోజున బస్సు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. – ఖమ్మంమయూరిసెంటర్

# పుణ్యక్షేత్రాలకు వెళ్తున్నారా..? ఆర్టీసీ బస్సులు రెడీ..!

- పంచరామాలు, అన్నవరం, శబరిమల, అరుణాచలానికి సర్వీసులు
- ఖమ్మం రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి సిద్ధం
- ముందస్తు రిజర్వేషన్‌కు సైతం అవకాశం

### పంచరామాలు, అన్నవరం



పంచరామ క్షేత్రాలైన అమరావతి (అమరలింగేశ్వర స్వామి), భీమవరం (సోమేశ్వర స్వామి), పాలకొల్లు (క్షీరలింగేశ్వరస్వామి), సామర్లకోట (భీమలింగేశ్వరస్వామి), ద్రాక్షారామం(భీమేశ్వరస్వామి) క్షేత్రాలకు ఈ నెల 3, 10, 17, 24 తేదీల్లో (ప్రతీ ఆదివారం) రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి ప్రత్యేక (సూపర్ లగ్జరీ) బస్సులు నడపనున్నారు. ఒకే రోజులో పంచారామ క్షేత్రాలను దర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. అలాగే అన్నవరానికి సైతం అదే తేదీల్లో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. పంచారామాలు, అన్నవరం దర్శనానికి వెళ్లే భక్తులు సీట్లను www.tgsrtcbus.in వెబ్ సైట్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు.

**రీజియన్‌లో డిపోల వారీగా మేనేజర్ల సెల్ నంబర్లు**

| డిపో | సెల్‌నంబర్ |
|---|---|
| ఖమ్మం | 99592 25958 |
| కొత్తగూడెం | 99592 25959 |
| భద్రాచలం | 99592 25960 |
| మధిర | 99592 25961 |
| సత్తుపల్లి | 99592 25962 |
| మణుగూరు | 99592 25963 |

### రద్దీకి అనుగుణంగా బస్సులు



కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడిపించనున్నాం. నిర్ణయించిన తేదీల్లో భక్తుల రద్దీకి బస్సులు ఏర్పాటు చేస్తాం. ఆర్టీసీలో కొత్త బస్సులే కాక నిపుణులైన డ్రైవర్లు ఉన్నారు. సురక్షితంగా వెళ్లి వచ్చేందుకు ఆర్టీసీ సర్వీసులను వినియోగించుకోవాలి.

–ఎ.సరిరామ్, ఆర్ఎం, ఖమ్మం రీజియన్, ఆర్టీసీ

### అరుణాచలం..

కార్తీకపౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలంలో గిరిప్రదర్శనకు వెళ్లే భక్తుల కోసం ఈనెల 13న రాత్రి ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నాయి. ఈ ప్యాకేజీలో కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్ పుణ్య క్షేత్రాల సందర్శన కూడా ఉంటుంది. తిరిగి 16న ఉదయం వరకు డిపోలకు బస్సులు చేరుకుంటాయి. ఈ బస్సుల్లో టికెట్లు బుకింగ్ కోసం డిపోల్లో లేదా www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో కానీ సందర్శించవచ్చు.

### అయ్యప్ప మాలధారుల కోసం..

ఉమ్మడి జిల్లాలో పలువురు భక్తులు అయ్యప్ప మాల ధరిస్తున్నారు. వీరు శబరిమలకు వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల నుంచి అద్దె ప్రాతిపదికన సూపర్ లగ్జరీ బస్సులు నడపనుంది. బస్సు బుక్ చేసుకుంటే ఇద్దరు స్వాములు(గురుస్వామి–మణికంఠస్వామి), ఇద్దరు వంట మనుషులకే కాక సామగ్రి సర్దే ఒకరికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారు. వివరాల కోసం డిపో మేనేజర్‌ను సంప్రదించాలి.

# కార్తీకం..శివోహం..

**నేటి నుంచి కార్తీక మాసం**

- శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- ప్రతీ సోమవారం తులసి చెట్టుకు పూజలు



పాల్వంచరూరల్: ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు (ఫైల్)

ఇల్లెందురూరల్/పాల్వంచరూరల్/కొత్తగూడెంటౌన్: పరమ శివుడికి ప్రీతిపాత్రమైన కార్తీక మాసాన్ని భక్తులు పవిత్రంగా భావిస్తారు. వేకువజామున స్నానాలు, తులసి పూజలు, నోములు, ఉపవాసాలతో ఈ మాసం భక్తి భావాన్ని పెంపొందించనుండగా, వీటితో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని నమ్మిక. పెద్దలు పెట్టిన పూజా నియమాలు, వ్రతాల్లో ఆరోగ్య సూత్రాలు మిళితమై ఉన్నాయి. కార్తీక మాసం నేపథ్యంలో ఆధ్యాత్మికం.. ఆరోగ్యం మిళితమైన పూజలు, నియమాలపై ప్రత్యేక కథనం..

**ఔషధ మొక్క తులసి**

కార్తీక పౌర్ణమి రోజున తులసి జన్మదినంగా భావిస్తారు. ఈ రోజు లక్ష్మీదేవి అంశ అయిన తులసి మొక్క వివాహం మహావిష్ణువు రూపమైన అశ్వత్థ వృక్షంతో నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. కాగా, తులసి మొక్కల్లో ఓ రకమైన లక్ష్మీ తులసి (తెలుపురంగు)కి కార్తీకమాసంలో ప్రతీ సోమవారం దీపారాధన, పూజలు చేస్తారు.

**కార్తీక దీపం**

మానవ నిత్యజీవితంలో పంచేంద్రియాలు చేసిన పాపాలను కర్మ అనే నూనెతో దహించి వేసేందుకు శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగిస్తారు. దీపారాధనలో ఒత్తిని అయిదు పొరలుగా చేయడాన్ని పంచేంద్రియాలకు సూచికగా భావిస్తారు. దే. పౌర్ణమి రోజు ఆవు నెయ్యితో తులసి కోట దగ్గర మహిళలు దీపాలు వెలిగిస్తారు.

**కార్తీక మాసంలో చేయాల్సినవి**

ఈ నెలలో చేసే ఉపవాసం, జాగరణ, పుణ్యస్నానం, దానం సాధారణ రోజుల్లో కంటే అధిక పుణ్యఫలాలను ఇస్తాయని ప్రజలు విశ్వసిస్తారు. మహావిష్ణువును తులసి దళాలు, మల్లె, కమలం, జాజి, అవిసె పూలు, గరకలతో.. పరమశివుడిని బిల్వ దళాలు, జిల్లేడు పూలతో పూజిస్తే ఎంతో మేలు జరుగుతుందని భక్తుల నమ్మిక. భక్తులు ఉదయం స్నానం, జపం దేవతారాధన చేసి మధ్యాహ్నం భోజనం, రాత్రికి మాత్రం పాలు, పండ్లు తీసుకోవాలి.

**కార్తీకం ఆరోగ్య ప్రదాయిని**

కార్తీక పౌర్ణమిలో ఉసిరికాయలతో ప్రమిదలు తయారు చేసి దీపాలు వెలిగించడం ప్రత్యేకత. అలాగే, ఉసిరితో స్నానం చేయడం వల్ల చర్మవ్యాధులు దరిచేరవు. కార్తీక పౌర్ణమి రోజు తప్పకుండా బెల్లంతో పాయసం చేసి ప్రసాదంగా పెడతారు. దీనిలో ఎండు పండ్లు, బెల్లం వాడతారు. బెల్లంలో ఇనుపధాతువు అధికంగా ఉంటుంది. మహిళలకు ఇది ఉపయోగకరం. ఎండు పండ్లలో కూడా ఎన్నో పోషక విలువలు ఉండటంతో ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇక భక్తులు ఉపవాస దీక్షలు చేస్తారు. కనీసం ఒకపూట ఉపవాస దీక్షలు చేసే అలవాటు వల్ల కడుపులో మంట, అల్సర్, మలబద్ధకం వంటివి తగ్గిపోతాయి. జీర్ణశక్తి పెరుగుతుంది. మధుమేహం, అధిక బరువు, రక్తపోటు వంటి వ్యాధులు నియంత్రణలోకి వస్తాయి. అలాగే, ఈ నెలలో ప్రకృతితోపాటు రుతుపవనాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ సమయాన నది, సముద్ర జలాల్లో శరీరానికి అవసరమైన లవణాలు నిక్షిప్తమై ఉంటాయి. అందుకే కార్తీక మాసంలో సూర్యోదయానికి ముందే భక్తులు నదీస్నానం చేసేందుకు ఇష్టపడుతారు. బ్రహ్మముహూర్తంలో నదీజలం వెచ్చగా ఉంటుంది. ఈ సమయాన స్నానం చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

### విశిష్ట ఫలితాలు....



కార్తీక మాసం శనివారం నుంచి డిసెంబర్ 1 వరకు ఉంటుంది. నెల పాటు శివుడికి అభిషేకాలు జరుగుతాయి. ప్రతీ సోమవారం తులసి, ఉసిరి చెట్టు వద్ద దీపారాధన చేస్తే మంచిది. సూర్యోదయానికి ముందు దీపారాధానతో విశిష్ట ఫలితాలు ఉంటాయి.

–పద్మనాభశర్మ, వేదపండితుడు, పెద్దమ్మతల్లి ఆలయం

### శివ, కేశవులకు ప్రీతికరం



కార్తీకమాసం అంటే శివుడు, విష్ణువుకు ప్రీతికరమని పురాణాలు చెబుతున్నాయి. ఈ నెలలో ఉపవాసం ఉండి అభిషేకాలు, కుంకుమార్చన చేస్తే పుణ్యఫలం దక్కుతుంది. కార్తీకంలో పూజలు, ఉపవాసాల ద్వారా భక్తితో పాటు ఆరోగ్యంకూడా దరిచేరుతుంది.

–రాధాకృష్ణశర్మ, అర్చకుడు, గణేశ్‌టెంపుల్

# కోడిపందేల స్థావరాలపై దాడి

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ)/దమ్మపేట/ములకలపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలోని కొండాయిగూడెం గ్రామశివారులో గురువారం కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. వివిధ గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1200 నగదు, మూడు ద్విచక్రవాహనాలు, 7 సెల్‌ఫోన్లు, 3 పందెం పుంజులు స్వాధీనం చేసుకున్నారు. 12 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే, దమ్మపేట మండలంలోని మారప్పగూడెం శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.4,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు. అలాగే, ములకలపల్లి మండలంలోని రాజీవ్ నగర్ శివారులో కోడి పందేల స్థావరంపై ఎస్ఐ దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని, రూ.5 వేల నగదు, నాలుగు కోడి పుంజులు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ వెల్లడించారు.

### పేకాట స్థావరంపై దాడి

పాల్వంచరూరల్: మండలంలోని పాండురంగాపురం శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఒకరిని అదుపులోకి తీసుకోగా.. ఇద్దరు పరారయ్యారని, రూ.1,000 స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేశ్ తెలిపారు.

**అశ్వారావుపేటలో..**

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని నందమూరినగర్ సమీపంలోని తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం స్థానిక పోలీసులు దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.7,500 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతి రాజు తెలిపారు.

### దీపావళి బాంబు మిస్ ఫైర్



ఎర్రగా మారిన బాలుడి ఎడమ కన్ను



ఆస్పత్రిలో చికిత్స అనంతరం బాలుడు

కరకగూడెం: దీపావళి సందర్భంగా బాణసంచా కాలుస్తుండగా బాంబు మిస్‌ఫైర్ అయి ఓ బాలుడు గాయపడ్డాడు. కరకగూడెం మండల కేంద్రానికి చెందిన 12 ఏళ్ల తనుష్ ఇంటి ముందు బుధవారం రాత్రి స్నేహితులతో కలిసి టపాసులు కాలుస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఓ బాంబు దగ్గరగా పేలి వేగంగా బాలుడి ఎడమ కంటికి తాకడంతో తీవ్ర గాయమైంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని వెంటనే మణుగూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడి నుంచి హైదరాబాద్ తరలించి ఓ ప్రవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించారు.

### ఖాళీ బాటిళ్లతో..

ప్లాస్టిక్ బాటిళ్లను వృథాగా పడేయకుండా మొక్కల చుట్టూ నీరు నిలిచేలా ఏర్పాటు చేశారు. మండలంలోని ఊట్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం లోపలి వెళ్లే మార్గంలో ప్రధాన గుమ్మానికి రెండు వైపులా మొక్కల్ని పెంచుతున్నారు. వృథాగా పడేసే ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లను చుట్టు పాదులా భూమిలో పాతారు. ఖాళీ బాటిళ్లలో రంగు రంగుల పేపర్లు పెట్టడంతో అక్కడివారిని ఆకట్టుకుంటున్నాయి.

– అశ్వారావుపేటరూరల్



మొక్కల పాదు భాగంలో ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు

### కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామ పంచాయతీ దేశ్యాతండా గ్రామానికి చెందిన బానోత్ సుమన్ (27) కుటుంబ కలహాల కారణంగా గడ్డిమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య బానోత్ రేణుక, పోలీసుల కథనం మేరకు.. పొలం పనికి వెళ్దామని భార్య రేణుక చెప్పగా సుమన్ ఘర్షణ పడ్డాడు. దీంతో ఆమె పొలం వద్దకు వెళ్లగా సుమన్ గడ్డిమందు తాగాడు. విషయం తెలిసిన రేణుక అతడిని ఖమ్మం తరలించింది. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో గత నెల 30వ తేదీన రాత్రి ఇంటికి చేర్చారు. 31వ తేదీన సుమన్ మృతిచెందాడు. రేణుక ఫిర్యాదు మేరకు కొమరారం ఏఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# కూలర్ నుంచి చెలరేగిన మంటలు

**రూ.6 లక్షల ఆస్తి నష్టం**



దగ్ధమైన రూ.3 లక్షల నగదు

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామానికి చెందిన శ్రీరాం రమేశ్ గురువారం తెల్లవారుజామున కూలర్ ఆన్‌చేశారు. కొద్దిసేపు చక్కగా నడిచిన కూలర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న సామగ్రికి అంటుకున్నాయి. పంట విక్రయించి ఇంట్లో భద్రపర్చుకున్న రూ.3 లక్షల నగదు అగ్నికి ఆహుతైంది. ఇంట్లో ఉన్న ఫర్నిచర్ కూడా పాక్షికంగా దెబ్బతిన్నది. మంటలు ఆర్పేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ప్రమాదంలో రమేశ్ కుటుంబానికి రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం వాటిలినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

# వదిన చేతిలో మరిది హతం

**తన చెల్లెలితో గొడవ ఎందుకని అడగడంతో ఘటన**



కొర్ని ప్రదీప్ (ఫైల్)

ఖమ్మంరూరల్: పండుగ సందర్భంగా ఇల్లు శుభ్రం చేయలేదని వదినను ఆడపడుచు ప్రశ్నించగా గొడవ జరిగింది. దీంతో ఆడపడుచు పక్కింటికి వెళ్లిపోగా తన చెల్లెలితో ఎందుకు గొడవ పడ్డావని అడిగిన మరిదిని వదిన హత్య చేసిన ఘటన ఇది. ఖమ్మంరూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలో దీపావళి పండుగ రోజైన గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు... గ్రామానికి చెందిన కొర్ని రామయ్యకు కుమారులు ప్రశాంత్, ప్రదీప్, కూతురు ప్రవళిక ఉన్నారు. ఇందులో ప్రదీప్ మినహా మిగతా వారికి వివాహాలు అయ్యాయి. దీపావళి సందర్భంగా ప్రవళిక పుట్టింటికి రాగా, ఇంటిని ఎందుకు శుభ్రం చేయలేదని వదిన ఇందును ప్రశ్నించింది. దీంతో వదిన – మరదలు గొడవ పడడంతో ప్రవళిక పక్కింటికి వెళ్లిపోయింది. కాసేపయ్యాక వచ్చిన ప్రదీప్ తన చెల్లెలితో ఎందుకు గొడవపడ్డావని వదిన ఇందిరను ప్రశ్నించాడు. ఈమేరకు ఆగ్రహించిన ఆమె ప్రదీప్ ఛాతిలో కత్తితో పొడవడంతో కుప్పకూలాడు. కుటుంబీకులు ఆయనను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై మృతుడి తండ్రి రామయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు. కాగా, ఇందు తన పెద్దమ్మ రెంటాల మణి, అమ్మమ్మ భాగమ్మ, తల్లి దాసరి బాయమ్మ ప్రోద్బలంతోనే ఈ ఘటనకు పాల్పడినట్లు చెబుతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బోనకల్: ఆటో – బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు... మండల కేంద్రానికి చెందిన పాలకుర్తి వెంకటరామారావు తన మనవడు, మనవరాలితో కలిసి శుక్రవారం రాత్రి బైక్‌పై రావినూతల వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో బోనకల్ నుండి వైరా వైపు వెళ్తున్న ఆటో వీరి బైక్‌ను ఫ్లైఓవర్‌పై ఢీకొట్టగా వెంకట్రావుకు తలకు గాయాలయ్యాయి. అలాగే ఆయన పూజిత కాలు విరగగా, మనవడికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### యువకుడి మృతిపై అనుమానాలు?



జగదీష్ (ఫైల్)

పాల్వంచరూరల్: మండల పరిధిలోని సోములగూడెం గ్రామానికి చెందిన యువకుడు ఖమ్మంలో మృతి చెందగా, ఈ ఘటనపై కుటుంబీకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి సోదరుడు కామిశెట్టి సాంబశివరావు కథనం ప్రకారం.. సోములగూడెం గ్రామానికి చెందిన కామిశెట్టి జగదీష్ (30) రెండేళ్ల క్రితం ఉపాధి కోసం ఖమ్మం సమీపంలోని పెద్దతండాకు వెళ్లాడు. స్థానికంగా ఓ వెల్డింగ్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే శుక్రవారం పనికి వెళ్లిన అతడు... అక్కడే మృతి చెందినట్లు తమకు సమాచారం ఇచ్చారని సోదరుడు తెలిపాడు.

### గోదావరిలో మునిగి యువకుడు మృతి



చలపతి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లిన ఓ యువకుడు మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఒడిశాలోని ఓ కంపెనీలో పనిచేసేందుకు హైదరాబాద్ నుంచి వెళ్లిన చలపతి (25).. కారులో అర్జున్‌రెడ్డి, రాజ్‌కుమార్‌తో కలిసి కారులో తిరుగుపయనమయ్యారు. భద్రాచలంలో ఆగి గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈత రాకపోవడంతో అర్జున్‌రెడ్డికి, రాజ్‌కుమార్ ఒడ్డున్నే ఉండిపోగా.. చలపతి గోదావరిలో దిగాడు. లోతు అంచనా వేయలేక స్నేహితులు చూస్తుండగానే గల్లంతయ్యాడు. స్థానిక బోటు నిర్వాహకుడు ప్రసాద్, అగ్నిమాపక, పోలీస్ శాఖ సిబ్బందితో కలిసి మధ్యాహ్నం 12 గంటల నుంచి గాలింపు చేపట్టగా సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

### అనుమానాస్పద స్థితిలో యువకుడు...



తెల్లపుట్ల గోపి(ఫైల్)

వైరారూరల్: దీపావళి పండుగ వేళ ఓ యువకుడు మృతి చెందగా, ఘటనపై అనుమానాలు ఉన్నాయని ఆయన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని గరికపాడులో జరిగిన ఈ ఘటన వివరాలు... గ్రామానికి చెందిన తెల్లపుట్ల గోపి(24) గురువారం తన స్నేహితులతో వాలీబాల్ ఆడాక గరికపాడు ఏటిలో చెక్ డ్యాం వద్ద ఈత కొట్టేందుకు వెళ్లాడు. గోపి ఈత కొడుతున్న సమయాన అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆయన స్నేహితులు గరికపాడులోని ఆర్ఎంపీ వద్దకు, అక్కడి నుంచి వైరాలోని ప్రైవేట్ ఆస్పతికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆయన మృతదేహాన్ని గరికపాడు తీసుకెళ్లారు. అయితే, గోపి బంధువులు శుక్రవారం డయల్ 100కు ఫోన్ చేసి మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పడంతో ఎస్సై ఏ.వంశీకృష్ణ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై మృతుడి తండ్రి దేవదాసు ఫిర్యాదుతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# విదేశీ మద్యం ఎలాతెచ్చారు?

- పార్టీకి మద్యం ఎవరు సరఫరా చేశారు..?
- చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డిల విచారణ


విచారణకు వచ్చిన రాజ్ పాకాల

**చేవెళ్ల:** రాయల్టీ చెల్లించకుండా విదేశీ మద్యం ఎలా తీసుకొచ్చారు..స్టాంప్ డ్యూటీ చెల్లించారా ? పార్టీకి మద్యం సరఫరా ఎవరు చేశారు.. ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? పార్టీలో డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? పార్టీలో మద్యం పంపిణీ చేసినా పర్మిషన్ ఎందుకు తీసుకోలేదు అంటూ పలు అంశాలపై కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను ప్రశ్నించినట్టు తెలిసింది. అనుమతి లేకుండా పార్టీ నిర్వహించాడనే కేసులో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల శుక్రవారం విచారణ నిమిత్తం చేవెళ్లలోని ఎక్సైజ్ కార్యాలయానికి హాజరయ్యారు. జన్వాడలోని ఆయన ఇంటి పక్కనే ఉండే నాగేశ్వర్‌రెడ్డి విల్లాలోనూ విదేశీ మద్యం దొరకడంతో ఆయనకూ నోటీసులు అందజేయగా, ఆయన కూడా చేవెళ్లకు వచ్చారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్‌కుమార్, చేవెళ్ల సీఐ శ్రీలత తదితరులు రాజ్‌పాకాల, నాగేశ్వర్‌రెడ్డిలను విచారించారు. అడ్వకేట్ల ఎదుట నిర్వహించిన విచారణకు సంబంధించిన వీడియోలు తీసుకున్నట్టు సమాచారం. మధ్యాహ్నం 1:40 నుంచి రాత్రి 8:10 వరకు విచారణ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు రాజ్‌పాకాలను, ఆ తర్వాత నాగేశ్వర్‌రెడ్డిని విచారించారు. అనంతరం రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డి ఒకేసారి న్యాయవాదులతో కలిసి బయటకు వచ్చారు. అయితే ఇంట్లో నిర్వహించే చిన్నపాటి దావత్ అయినందున.. తమ మేనేజర్ ఈ విషయాలు చూసుకున్నారని రాజ్ పాకాల చెప్పినట్టు సమాచారం. విచారణ జరిగినంత సేపు మీడియాతోపాటు ఇతరులెవరినీ లోనికి అనుమతించలేదు. బయటకు వచ్చిన అనంతరం రాజ్ పాకాల మాట్లాడుతూ.. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాం. ఇంట్లో నిర్వహించిన చిన్నపాటి దావత్‌ను మా మేనేజర్ చూసుకున్నారు. పార్టీలో లోకల్ మద్యం సర్వ్ చేశామన్నారు.

**కేసు ఇన్వెస్టిగేషన్‌లో ఉంది**
ఈ కేసు ప్రస్తుతం ఇన్వెస్టిగేషన్‌లో ఉంది. రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డి విచారణకు సహకరించారు. కేసు కంటిన్యూ అవుతోంది. కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకు మించి వివరాలేవీ చెప్పలేం. –దశరథ్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్


సిరిసిల్ల జిల్లా రంగంపేటలో గ్రామంలో తడిసిన వరి ధాన్యం


మంచిర్యాల జిల్లా మామిడిపల్లి శివారులో నేలవాలిన వరిపైరు


దుబ్బాక మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం

# నోటికందే కూడు నీటిపాలు!

**ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలతో నేలవాలిన వరి**
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యం.. ఇరవై రోజులుగా కొనుగోళ్లు లేక ఎక్కడికక్కడ ధాన్యం కుప్పలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- పిడుగుపాటుతో ఇద్దరు మృతి

**మెదక్/ సిరిసిల్ల/ వీర్నపల్లి/ రుద్రంగి/ నిర్మల్/ వాజేడు:** ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చాయి. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం నీటి పాలవగా.. కొన్నిచోట్ల కోతకు వచ్చిన వరిపంట పొలాల్లోనే నేలకొరిగింది. దీనితో అన్నదాతలు ఆందోళనలో పడిపోయారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి ఇన్నిరోజులైనా ఇంకా కొనుగోళ్లు ఊపందుకోలేదని.. వర్షాలతో తమ ధాన్యం తడిసి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆరిపోయి తేమశాతం తగ్గిన వడ్లు కూడా వర్షానికి తడిశాయని, మళ్లీ ఆరబెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రతీ గింజ కొంటామని ప్రభుత్వం ప్రకటించిందని.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని మండిపడుతున్నారు.

**తడిసిపోయిన ధాన్యం..:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే 156 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు మాత్రం మొదలుకాలేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా కురిసిన వర్షంతో రైతులు ఆగమాగమయ్యారు. వీర్నపల్లి, రుద్రంగి మండల కేంద్రాల్లో టార్పాలిన్లు లేకపోవడంతో వడ్లు తడిసిపోయాయి. రుద్రంగి మండలం పరిధిలో రైస్‌మిల్లర్లు ధాన్యం దింపుకోబోమని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు.

- మరోవైపు ఉమ్మడి మెదక్ జిల్లాలో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. దుబ్బాక, మెదక్, నర్సాపూర్, కొల్చారం, చిన్నశంకరంపేట, కౌడిపల్లి, చిలప్‌చెడ్, నిజాంపేట, హత్నూర మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం నీటిపాలైంది. వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.
- నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో శుక్రవారం గంటకు పైగా వాన కురిసింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపైకి వరద చేరింది. కుంటాల మండలంలో కోతకు వచ్చిన వరి నేలవాలింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి, జైపూర్ మండలాల్లో సుమారు 4,000 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. భీమిని, కన్నెపల్లి మండలాల్లో వందల ఎకరాల్లో పత్తి తడిసిపోయింది.

## పిడుగుపాటుకు ఇద్దరు మృతి

రాష్ట్రంలో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం దమ్మన్నపేటలో పత్తి ఏరుతుండగా పిడుగుపడి గడ్డం నాగమ్మ (26) అనే మహిళ మృతి చెందింది. ఇక ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురంలో వ్యవసాయ భూమిలో ఎడ్లను మేపుతుండగా పిడుగుపాటుకు గురై సొనప నవీన్ (24) మృతి చెందాడు.

## సెటిల్‌మెంట్ అని పిలిపించి..
# కారుతో తొక్కించి

**మాజీ కానిస్టేబుల్ ఈశ్వర్‌పై హత్యాయత్నం**

ఏళ్లుగా జేబుదొంగల గ్యాంగ్‌లు నిర్వహిస్తున్న ఈశ్వర్.. నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీలు

ఈ వ్యవస్థీకృత దందాలో ఇతడిదే పూర్తి ఆధిపత్యం.. దీంతో ముఠా నాయకుల మధ్య తలెత్తిన విభేదాలు

'దొంగలతో దోస్తీ' ఆరోపణలపై పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం కోల్పోయిన మేకల ఈశ్వర్‌పై గురువారం రాత్రి హత్యాయత్నం జరిగింది. వ్యవస్థీకృతంగా జేబు దొంగల ముఠాలు నడిపే ఈశ్వర్‌కు, ఆ ముఠాలకు చెందిన మరికొందరు నాయకుల మధ్య ఆధిపత్య పోరే దీనికి కారణమని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కొన్నాళ్లుగా తమిళనాడులో ఉంటూ తెలంగాణ వ్యాప్తంగా సెల్‌ఫోన్ జేబు దొంగల ముఠాలు నిర్వహిస్తున్న ఇతడిని సెటిల్‌మెంట్ కోసమని పిలిచిన నలుగురు కీలక నిందితులు కారుతో ఢీ కొట్టారు. అతడి పైనుంచి రెండుసార్లు వాహనాన్ని నడపటంతో ఈశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. మీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని మందమల్లమ్మ చౌరస్తా వద్ద ఈ ఘటన జరగ్గా.. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలిసింది. – సాక్షి, హైదరాబాద్

**కక్ష కట్టి, సెటిల్‌మెంట్ అంటూ పిలిచి..**

ఇలాంటి కొన్ని ముఠాలపై ఈశ్వర్ గుత్తాధిపత్యం సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నగరంలో మరే ఇతర ముఠాకు 'పనివారు' దొరకుండా చేస్తున్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో ఆధిపత్య పోరు పెరిగిపోగా ఎవరైనా అతికష్టమ్మీద వేరే ప్రాంతం నుంచి దొంగల్ని పట్టుకుని వస్తే, ఈశ్వర్ తనకున్న పాత పరిచయాల ద్వారా పోలీసులకు సమాచారం చేరవేస్తూ వాళ్లు అరెస్టు అయ్యేలా చేస్తున్నాడు. దీంతో కక్షకట్టిన నాలుగు ముఠాలకు చెందిన నాయకులు అతనిపై హత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. గురువారం మందమల్లమ్మ చౌరస్తాలోని ఓ బార్‌కు అతన్ని పిలిచిన నలుగురు నిందితులు.. కొద్దిసేపు వాగ్వాదం తర్వాత తమ ప్రతిపాదనల్ని తిరస్కరించి, బెదిరించి వెళ్లిపోతున్న ఈశ్వర్‌పై కారుతో ఢీ కొట్టి హత్యాయత్నం చేసినట్లు తెలిసింది. అయితే కొందరు వ్యక్తులు చిట్టీల వ్యాపారంలో విభేదాల వల్లే ఈశ్వర్‌పై హత్యాయత్నం చేశామంటూ మీర్‌పేట పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలుస్తోంది. దీంతో రాచకొండ పోలీసులు ఈ కేసును వివిధ కోణాల్లో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

**క్రైమ్ వర్క్ చేస్తూ క్రిమినల్స్‌తో నెట్‌వర్క్**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మేకల ఈశ్వర్ 2010లో కానిస్టేబుల్‌గా పోలీసు విభాగంలో అడుగుపెట్టాడు. ఎస్సార్‌నగర్, చిక్కడపల్లి, బేగంపేట పోలీసుస్టేషన్లతో పాటు టాస్క్‌ఫోర్స్‌లోనూ పని చేశాడు. మొదట్నుంచీ నేరాలకు సంబంధించిన విధులే నిర్వర్తించిన ఇతను.. అప్పట్లో చోరీ చేసిన ఫోన్లు ఖరీదు చేసే వాళ్లను బెదిరిస్తూ దందా మొదలెట్టాడు. తనకున్న పరిచయాలను వినియోగించుకుని చోరీకి గురైన ఫోన్ల ఐఎంఈఐ నంబర్లు సేకరించేవాడు. వాటి ఆధారంగా అవి ప్రస్తుతం ఎవరు వాడుతున్నారో గుర్తించేవాడు. విషయం తెలియక సెకండ్‌హ్యాండ్ మార్కెట్లలో చోరీ ఫోన్లు కొనుగోలు చేసి వాడుతున్న వారిని పిలిచి బెదిరించేవాడు. ఫోన్ తీసుకోవడంతో పాటు కేసు పేరుతో భయపెట్టి కనీసం రూ.25 వేలు వసూలు చేసేవాడు. రికవరీ చేసిన ఫోన్‌ను అమ్ముకుని సొమ్ము చేసుకునే వాడు. ఇలా మొదలైన ఈశ్వర్ దందా పెద్ద నెట్‌వర్క్‌గా మారింది.


ఈశ్వర్

**వసతులు, 'జీతాలు' ఇచ్చి నేరాలు**

చోరీ ఫోన్ల మార్కెట్‌పై పట్టు లభించడంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఉన్న స్నాచర్లు, దొంగలతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. ఓ ప్రాంతానికి చెందిన వారిని మరోచోటుకు పంపేవాడు. అక్కడ వారికి అద్దె ఇంటిలో వసతి కల్పించేవాడు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం నాలుగు ఫోన్లు కొట్టేయాలనే టార్గెట్ పెట్టేవాడు. వీటిలో ఒక ఫోన్‌ను విలువను లెక్కించి ఆ మొత్తాన్ని జీతం కింద వారికి ఇచ్చేవాడు. ఇక ఈ ఫోన్లను విక్రయించడానికి ఈ నాలుగు రాష్ట్రాల్లో ఉన్న సెకండ్ హ్యాండ్ మార్కెట్లలోని వ్యాపారులతో సంబంధాలు పెట్టుకున్నాడు. వీరినుంచి ప్రతినెలా మామూళ్లు కూడా వసూలు చేసేవాడని తెలిసింది. మరోవైపు సెల్‌ఫోన్లతో పాటు బంగారు నగలనూ స్నాచింగ్ చేయించేవాడు. 2022లో నల్లగొండ పోలీసులు ఈ తరహా ఓ కేసులో ఈశ్వర్‌ను అరెస్టు చేయడంతో హైదరాబాద్ పోలీసులు అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు.

## తల్లిదండ్రులకు అప్పులిచ్చి పిల్లలతో దందా

హైదరాబాద్‌లో ఫోన్ల దొంగతనం, విక్రయం దందా చేసే ముఠాలు ఎన్నో ఉన్నాయి. కొన్నాళ్లుగా వీళ్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో ప్రత్యేకంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. తల్లిదండ్రులకు భారీ మొత్తం అప్పు ఇవ్వడం ద్వారా వారి పిల్లలతో హైదరాబాద్ సహా దక్షిణాదిలోని ఇతర ప్రధాన నగరాల్లో దందా చేయిస్తున్నారు. వీరికి వసతి కల్పించడంతో పాటు ఆహారం, మద్యం సరఫరా చేయడమే కాకుండా ప్రతిరోజూ రూ.300 ఖర్చుల కోసం ఇస్తున్నారు. రద్దీ ప్రదేశాలు, బస్సులు, సభలు, సమావేశాల్లో సెల్‌ఫోన్ల చోరీ వీరి పని. ఈ ముఠాల్లో అప్పులు తీసుకున్న మహిళలు కూడా ఉన్నారు. వీరు తమ చిన్నారులతో కలిసి బంగారం, ఇతర దుకాణాలకు వెళ్లి, యజమానులు వర్కర్ల దృష్టి మళ్లించి చోరీలు చేస్తుంటారు. వీరు ప్రతిరోజూ నిర్దిష్ట సంఖ్యలో చోరీలు చేయాలనే షరతు ఉంది. కాగా చోరీ చేసిన సొత్తులో కొంత మొత్తం వారి అప్పులో అసలు, వడ్డీ జమ చేసుకుంటారు. ఇలా అప్పు తీరే వరకు వీరంతా ముఠా నాయకుల కోసం పని చేయాల్సి ఉంటుంది. ఇలాంటివి నగరంలో పలు ముఠాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**జిల్లా వార్తలు**

## సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన


సీసీ రోడ్డును తనిఖీ చేసిన అధికారులు

**కారేపల్లి:** ఖమ్మం జిల్లా సింగరేణి గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. కారేపల్లిలోని క్యాబిన్ బజార్, బీసీ కాలనీ, భారత్ నగర్, ఎన్‌వీఆర్ నగర్‌లో వేసిన సీసీ రోడ్లకు పగుళ్లు వచ్చాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో క్వాలిటీ కంట్రోల్ బృందం నాణ్యతను తనిఖీ చేసింది.

## 5 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి సంస్థలో 327 పోస్టుల నియామకానికి నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు పరిశీలించనున్నారు. ఈ పరీక్ష ఆగస్టు 6, 7వ తేదీల్లో నిర్వహించగా 327 మందితో మెరిట్ జాబితాను గత నెల 29న యాజమాన్యం విడుదల చేసిన విషయం విదితమే. ఈ మేరకు అభ్యర్థుల సర్టిఫికెట్లను కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో పరిశీలించనుండగా, ఆతర్వాత మెడికల్ బోర్డుకు పంపిస్తారు.

## వంతెనను పరిశీలించిన ఐటీడీఏ పీఓ


వంతెనను పరిశీలిస్తున్న పీఓ రాహుల్

**అశ్వాపురం:** మండలంలోని రామచంద్రాపురం–ఒడ్డుగూడెం గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన వంతెనను ఐటీడీఏ పీఓ రాహుల్ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ మిగిలిన పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తక్కువ ధర.. ఎక్కువ నాణ్యత!



సైట్‌లో పొందుపరిచిన ఉపకరణాల చిత్రాలు

**ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే సరి..**
విద్యుత్ ఉపకరణాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని నేరుగా ఇంటి వద్ద డెలివరీ పొందే అవకాశాన్ని ఈఈఎస్ఎల్ కల్పించింది. వినియోగదారులు www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ హోమ్ పేజీలోకి వెళ్లి అందుబాటులో ఉన్న, అవసరమైన విద్యుత్ ఉపకరణాలను ఆర్డర్ చేసి కొనుగోలు చేయవచ్చు. ప్రధాన పట్టణాలు, నగరాల్లోనైతే ఆర్డర్ చేసిన 6–7 రోజుల్లో, ఇతర ప్రాంతాల్లో 10–12 రోజుల్లో ఉపకరణాలు ఇంటికి చేరతాయని చెబుతున్నారు.

**ఎన్పీడీసీఎల్ సైట్‌లో విద్యుత్ ఉపకరణాల కొనుగోలుకు అవకాశం**
- ఈఈఎస్ఎల్ ద్వారా బుకింగ్, ఇంటి వద్దే డెలివరీ
- కేంద్ర, రాష్ట్ర సంస్థల భాగస్వామ్యంతో విక్రయాలు
- అందుబాటులో బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, స్టౌలు, ఏసీలు

**ఖమ్మంవ్యవసాయం:** నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలను సరసమైన ధరలకు వినియోగదారులకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. మార్కెట్‌లో రకరకాల కంపెనీల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నా నాణ్యత, తక్కువ విద్యుత్ వినియోగించుకునే వాటిపై అవగాహన లేక వినియోగదారులు ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. దీంతో అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన పరికరాలను అందించే లక్ష్యంతో ప్రభుత్వ సంస్థలు ముందుకొచ్చాయి. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుబంధంగా నిర్వహిస్తున్న ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) సంస్థ పలు రకాల విద్యుత్ ఉపకరణాలను విక్రయిస్తుండగా ఇవి నాణ్యమైనవే కాక విద్యుత్ బిల్లుల్లో ఆదా అవుతుందని సంస్థలు స్పష్టం చేస్తున్నాయి.

**ఎన్పీడీసీఎల్ భాగస్వామ్యంతో..**
ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ అందుబాటులోకి తీసుకొచ్చిన విద్యుత్ ఉపకరణాల నాణ్యత, ధరలనే కాక వినియోగదారులకు బిల్లుల్లో ఆదా అవుతుండడాన్ని ఎన్పీడీసీఎల్(నార్తర్న్ పవర్ డి‌స్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్పీడీసీఎల్) గుర్తించింది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఈ ఉపకరణాలు మేలు చేసేవిగా ఉండడంతో ప్రోత్సహించడం కేంద్ర విద్యుత్ శాఖ అనుబంధ సంస్థ అయిన ఈఈఎస్ఎల్‌తో ఎన్పీడీసీఎల్ భాగస్వామ్యమైంది. రెండు సంస్థల ఆధ్వర్యాన విద్యుత్ ఉపకరణాలను విక్రయించేందుకు నిర్ణయించి ఒప్పందం కుదుర్చుకున్నాయి.

**విద్యుత్ ఉపకరణాల ధరలు (రూ.ల్లో)**

| ఉపకరణం | ఎంఆర్‌పీ | ప్రభుత్వ ధర |
|---|---|---|
| ఎల్‌ఈడీ బల్బ్ 9 వాట్స్ (3 స్టార్) | 150 | 75 |
| ఎల్‌ఈడీ బల్బ్ 6 వాట్స్ (5 స్టార్) | 149 | 85 |
| ఎమర్జెన్సీ ఎల్‌ఈడీ 10 వాట్స్ | 649 | 459 |
| ట్యూబ్‌లైట్ 20 వాట్స్ | 349 | 199 |
| సీలింగ్ ఫ్యాన్ (5 స్టార్) | 4,100 | 2,699 |
| ఎలక్ట్రికల్ స్టౌ 12 వాట్స్ | 2,999 | 1,900 |
| ఏసీ 1 టన్ (5 స్టార్) | 55,000 | 36,500 |
| ఏసీ 1.5 టన్ (5 స్టార్) | 71,000 | 48,150 |

## ఖమ్మం - ఇల్లెందు రోడ్డుకు మహర్దశ

- రూ.38 కోట్లతో నాలుగు లేన్లుగా విస్తరణ
- మిగతా పనులకు రూ.40 కోట్లతో ప్రతిపాదనలు
- రెండు జిల్లాల నడుమ లింక్ రోడ్డు అభివృద్ధి


రహదారి విస్తరణకు చదును చేయిస్తున్న దృశ్యం

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారికి మహర్దశ పడుతోంది. రఘునాథపాలెం నుంచి బూడిదంపాడు వరకు నాలుగు లేన్లుగా విస్తరణ, డివైడర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.38 కోట్ల నిధులతో చేపడుతున్న ఈ పనులకు కొన్నాళ్ల క్రితం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయగా.. ఇటీవలే రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. ఖమ్మం నుంచి రోడ్డును విస్తరిస్తూ మూడు విడతల్లో రఘునాథపాలెం వరకు పూర్తిచేశారు. తాజాగా రఘునాథపాలెం నుంచి మరో 6.5 కి.మీ. మేర రోడ్డు విస్తరణ, డివైడర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం కేటాయించిన నిధులు బూడిదంపాడు సమీపం వరకే సరిపోతుండగా, ఖమ్మం నియోజకవర్గం పరిధిలోనే మరో 2 కి.మీ. మేర నిర్మాణానికి నిధులు కేటాయించాల్సి ఉంది.

**మిగతా పనులకు కూడా..**
ఖమ్మం నియోజకవర్గంలో మిగిలిన 2 కి.మీ.తో పాటు ఇల్లెందు నియోజకవర్గ పరిధి లింగాల క్రాస్ వరకు మిగిలిన రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు సుమారు రూ.40 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఈ నిధులు కూడా మంజూరైతే ఇల్లెందు – ఖమ్మం మధ్య ట్రాఫిక్ ఇక్కట్లు తీరనున్నాయి.

**నానాటికీ పెరుగుతున్న రద్దీ**
ఈ రహదారిలో నిత్యం వందలాదిగా బస్సులు, లారీలు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటికి తోడు ఇల్లెందులో ఉత్పత్తి అయ్యే బొగ్గును లారీల ద్వారా తరలించేది ఈ రహదారి మీదుగానే కావడంతో రద్దీగా ఉంటోంది. అంతేకాక ప్రతీ బుధవారం కామేపల్లి మండలం పండితాపురం వద్ద జరిగే సంతకు వేలాదిగా జనం హాజరవుతుండడంతో తరచుగా ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మరోపక్క రఘునాథపాలెంలో విత్తన గిడ్డంగి, గోదాంలు ఉండటం, త్వరలోనే సమీకృత గురుకుల పాఠశాల, స్వామినారాయణ్ పాఠశాలల నిర్మించనున్నారు. ఫలితంగా రద్దీ మరింత పెరుగుతోంది. అయితే, నాలుగు లేన్లుగా ఉన్నంత వరకు ప్రయాణం సాఫీగా సాగుతున్నా డబుల్ రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం రహదారిని విస్తరిస్తుండడం, మిగిలిన ప్రాంతంలోనూ విస్తరణకు ప్రతిపాదనలు రూపొందించడంతో సమస్యలు తగ్గి రెండు జిల్లాల నడుమ లింక్ రోడ్డు అభివృద్ధి చెందనుంది.

## కులమతాలను అడ్డం పెట్టుకుని బీజేపీ రాజకీయాలు

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

**నేలకొండపల్లి:** అధికారం కోసం బీజేపీ కులాలు, మతాలను అడ్డు పెట్టుకుని పబ్బం గడుపుకుంటోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. నేలకొండపల్లి మండలం బైరవునిపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలపై నిస్వార్థంగా పోరాడుతూ, జైలు జీవితాలను గడిపింది కమ్యూనిస్టులు మాత్రమేనని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ నాయకులకు జైలుకు వెళ్లిన చరిత్ర ఉందా అని ప్రశ్నించారు. కమ్యూనిస్టు పార్టీలను అంతం చేస్తామన్న టీడీపీ తెలంగాణలో లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. కాగా, బీజేపీ నేతలకు రాముడిపై భక్తి లేకపోగా, ఓట్ల కోసమే రామజపం చేస్తున్నారని విమర్శించారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు మరికంటి ఉమారాణి, రమేష్, గండు సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు కూనంనేనిని సన్మానించారు. ఈ సమావేశంలో సీపీ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, కర్నాటి భానుప్రసాద్, పాల్తీయ శ్రీనివాసరావు, కనకబండి సీతారాములు, పెద్దపాక గురవమ్మ, మేకల పుల్లయ్య, మల్లెబోయిన ఉపేందర్, పోలంపల్లి నారాయణ, కుంచం బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మాలల మహాపాదయాత్ర


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**తిరుమలాయపాలెం:** ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరగనున్నందున నిలిపివేయాలనే డిమాండ్‌తో భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు మాల మహానాడు ఆధ్వర్యాన చేపట్టిన పాదయాత్ర తిరుమలాయపాలెం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర చేపట్టిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌కు యూనిటీ ఆఫ్ మాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం సుధాకర్, నాయకులు కమటం లక్ష్మణ్, కొప్పుల అశోక్, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, తమ పాదయాత్ర 16 జిల్లాల్లో వెయ్యి కి.మీ. మేర సాగుతూ డిసెంబర్ 1న హైదరాబాద్‌లో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పప్పుల ప్రసాద్, ధరమల్ల ఉపేందర్, సందు రాజు, ఉండేటి ప్రకాశం, గుంతేటి వెంకటేశ్వర్లు, నూకతొట్టి సాల్మన్‌రాజ్, ఉండేటి ధర్మరాజు, ఉబ్బని కార్తీక్, కిరణ్, తూమాటి హజరయ్య తదితరులు పాల్గొన్నారు.